ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
5 జిల్లా వార్తలు
శనివారం 26 జూలై 2025



ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయంలో పలు అంశాలపై ఆయన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నగర వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా, ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలను శుభ్రం చేసి..నీరు నిలిస్తే తొలగించాలన్నారు. నగరవ్యాప్తంగా షిఫ్టుల వారీగా విధులు నిర్వహించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వచ్ఛ ఆటోలను డీఆర్‌సీసీలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, జీపీఎస్ ట్రాకింగ్ రీడింగ్ రిపోర్టును ప్రతి రోజు అందించాలన్నారు. నగర వ్యాప్తంగా రోడ్లపై చెత్త కనపడకుండా చర్యలు తీసుకోవడంతోపాటు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్ల వారీగా ఫాగింగ్, దోమల నివారణ మందు స్ప్రే చేయాలని, నీరు నిలిచిన చోట ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. పద్మానగర్ సమీకృత మార్కెట్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. అంబేడ్కర్ స్టేడియంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ షట్టర్లను అద్దెకు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు వేణుమాధవ్, ఖాదర్ మొహియుద్దీన్ పాల్గొన్నారు.

29న జాబ్‌మేళా

గణేశ్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. కళ్యాణ్ జువెల్లరీస్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ట్రైనీ, ఫ్లోర్ హోస్టెస్, సూపర్‌వైజర్, ఆఫీస్ బాయ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. డిగ్రీ, ఎంబీఏ చదివిన వారు అర్హులని తెలిపారు. వయస్సు 19 నుంచి 30 సంవత్సరాల్లోపు ఉండాలని, వేతనం 20 వేల నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 29న ఉదయం 11 గంటలకు బస్టాండ్ రోడ్, ప్రతిమ మల్టిప్లెక్స్ సమీపంలోని కళ్యాణ్ జువెల్లరీస్‌లో నిర్వహించే జాబ్‌మేళాలో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు 9052259333, 9944922677 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శ్రావణ సందడి ప్రారంభం

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు



మహాశక్తి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



జ్యోతినగర్‌సంతోషిమాత ఆలయంలో అమ్మవారు

కరీంనగర్ కల్చరల్ జూలై (ఆంధ్రజ్యోతి) 25: ఆలయాల్లో శ్రావణ సందడి ప్రారంభమైంది. తొలి రోజే శుక్రవారం కావడంతో మరింత ఆధ్యాత్మికత సంతరించుకుంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. దీంతో ఉదయం నుంచే ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఉపవాసాలు పాటిస్తూ పూజలు నిర్వహించి అర్చనలు చేయించుకున్నారు. గృహాలను మామిడి తోరణాలతో అలంకరించుకుని పూజా మందిరాలను శుభ్రం చేసి నైవేద్యాలు సమర్పించారు. శ్రావణ మాసాన్ని నియమ నిష్టలతో గడుపనున్నట్లు భక్తులు తెలిపారు. సాయంత్రం వేళల్లో ఆలయాల్లో భజనలు, భగవన్నామ సంకీర్తనలు ప్రారంభమయ్యాయి. యజ్ఞవరాహక్షేత్రంలో మహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం, పట్టు వస్త్ర సమర్పణ, పూలంగి సేవ, బిల్వదళాలతో అర్చన నిర్వహించారు. చైతన్యపురి మహాశక్తి దేవాలయంలో అమ్మవార్లకు అభిషేకం జరిగింది. జ్యోతీనగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో భక్తులు బారులుతీరి అమ్మవారికి ఒడిబియ్యం, వస్త్రాలు సమర్పించారు.

పేరుకే నిషేధం

యథేచ్ఛగా నిషేధిత పొగాకుఉత్పత్తుల విక్రయాలు



- షాపుల్లో తోరణాలుగా వేలాడదీసి అమ్మకాలు...
- చోద్యం చూస్తున్న అధికారులు

కరీంనగర్ క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గుట్కా, పాన్‌మసాలా వంటి కొన్ని హానికరమైన పొగాకు ఉత్పత్తులపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధాన్ని విధించింది. జిల్లాలో నిషేధిత పొగాకు ఉత్పత్తులు(గుట్కా) యథేచ్ఛగా అమ్ముతున్నారు. పొగాకు ఉత్పత్తులతో మనుషులు క్యాన్సర్ వంటి ప్రాణాంతక జబ్బులబారిన పడుతున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వం వాటి అమ్మకాలను పూర్తిగా నిషేధించింది.

● రోజుకు రూ. 30 లక్షల నుంచి 40 లక్షల వరకు అమ్మకాలు

జిల్లా వ్యాప్తంగా నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలు కరీంనగర్‌లోనే రోజుకు 30 లక్షల నుంచి 40 లక్షల వరకు జరుగుతున్నాయి. ఇటువంటి నిషేధిత, ప్రాణాంతకమైన ఉత్పత్తులను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి జిల్లాలో అమ్మకాలు సాగిస్తున్నప్పటికీ ఈ అక్రమ దందాను అరికట్టాల్సిన ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమ ర్శలు వస్తున్నాయి. మూడు రోజుల క్రితం కరీంనగర్‌లో నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టుకున్నారు.

● బీదర్ టు కరీంనగర్..

కర్ణాటకలోని బీదర్ నుంచి కరీంనగర్‌కు ఒక మినీట్రక్‌లో 304 బ్యాగ్‌లలో తరలిస్తున్న 2,500 నిషేధిత గుట్కా పాకెట్లను పోలీసులు పట్టుకున్నారు.వీటి విలువ 76 లక్షలుంటుందని పోలీసులు తెలిపారు. ఇది బీదర్‌లో కొనుగోలు చేసిన ధర మాత్రమే. స్థానికంగా విక్రయిస్తే దీని విలువ కోటిరూపాయలపైగానే ఉంటుందని తెలుస్తోంది. రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తుల నిషేధం ఉన్నప్పటికీ గుట్కా మాఫియా ఇంత బరితెగించి కరీంనగర్‌కు ఒక ట్రక్‌లో తీసుకువచ్చారు.



ఇటీవల పట్టుబడిన గుట్కాలోడ్‌తో ఉన్న వ్యాన్

● రెట్టింపు ధరకు విక్రయం

నిషేధం సాకు చూపుతూ గుట్కా మాఫియా రిటేల్ షాపులకు రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. గుట్కాతో క్యాన్సర్ వంటి ప్రాణాంతకర వ్యాధులు వస్తాయని చెబుతున్నా వాటికి అలవాటుపడ్డవారు మానుకోలేకపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాలు అని తేడా లేకుండా పాన్‌షాపులు, కిరాణషాపుల్లో గుట్కాలను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. నియంత్రించా

(మిగతా 8వపేజీలో)

శుక్రవారం సభతో మహిళల సమస్యల పరిష్కారం

కరీంనగర్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మహిళల సమస్యల పరిష్కారానికి శుక్రవారం సభ ఒక వేదికగా నిలుస్తుందని సీడీపీవో సబిత అన్నారు. మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వావిలాలపల్లి-3 అంగన్‌వాడి కేంద్రం, పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ మహిళలు తమ సమస్యలు ఏవైనా శుక్రవారం సభలో తెలుపవచ్చన్నారు. ప్రతి మహిళ, గర్భిణి, బాలింత శుక్రవారం సభకు తప్పక హాజరుకావాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యతోపాటు పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డీఎంహెచ్‌వో వెంకటరమణ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా శ్రీవాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె జ్యోతిలక్ష్మి, డీసీపీవో పర్వీన్, వైద్యాధికారి ఇమ్రాన్‌ఖాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమణి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్

7

ఎరువుల దుకాణాల్లో స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలి

తిమ్మాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల వద్ద నిల్వలకు సంబంధించి స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని హైదరాబాద్ అగ్రికల్చరల్ కో ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (హకా) జనరల్ మేనేజర్ ఎస్వీ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం అలుగునూర్, నుస్తులాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలు, డీసీఎంఎస్, ప్రాథమిక సహకార సంఘాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మకాలు ఈ పాస్ ద్వారానే చేయాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయధికారి భాగ్యలక్ష్మి, డీసీవో రామానుజాచార్యులు, మానకొండూర్ ఏడీ శ్రీధర్, హకా కరీంనగర్ డీఎం కృష్ణ, మండల వ్యవసాయాధికారి సురేందర్, నుస్తులాపూర్ సహకార సంఘం చైర్మన్ గుజ్జుల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కేంద్రం వైఖరి స్పష్టం చేయాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన జిల్లా కార్య వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విపక్షాల గొంతు నొక్కే విధంగా వ్యవహ రిస్తోందని విమర్శించారు. ఉపరాష్ట్రపతి విషయంలో పొమ్మనలేక పొగపెడుతున్నట్లు కనబడుతుందన్నారు. కేద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్న దన్నారు. పార్లమెంట్‌లో ఆపరేషన్ కగార్‌పై చర్చ చేయకుండా విపక్షాలకు అవకాశం ఇవ్వకుండా సమా వేశాలను వాయిదా వేయడం మంచి పద్ధతి కాదని తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం కేంద్రానికి ఆర్డినెన్స్ పంపించినప్పటికీ ఇప్పటి వరకు కేంద్రం తమ వైఖరి స్పష్టం చేయక పోవడం దుర్మార్గమన్నారు. బీసీ రిజర్వేషన్ల వల్ల స్థానిక ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులు పోటీ చేయడానికి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్, అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, టేకుమల్ల సమ్మయ్య, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, కిన్నెర మల్లవ్వ పాల్గొన్నారు.

ఎంఆర్ఐ లేక ఇబ్బందులు

- జిల్లా ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేసినా సౌకర్యాలు కరువు
- ప్రజలపై ఆర్థిక భారం



జిల్లా జనరల్ ఆసుపత్రి

సుభాష్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నదో డాక్టర్లు పరీక్షల ద్వారా తెలుసుకుంటున్నారు. అటువంటి పరీక్షల్లో కీలకమైన ఎంఆర్ఐ (మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్). ఇది ఒకరకమైన స్కానింగ్ యంత్రం. మెదడు, గుండె, నరాల సంబంధిత ఆరోగ్య సమస్యల నిర్ధారణకు ఎంఆర్ఐ పరీక్షలు ఎంతో అవసరం. జిల్లా జనరల్ ఆసుపత్రికి రోడ్డు ప్రమాదాలతోపాటు ఇతర ప్రమాదాలకు సంబంధించిన పేషంట్లు పెద్ద ఎత్తున వస్తుంటారు. ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో లేకపోవడంతో వారిని ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లకు పంపించాల్సి వస్తున్నది. దీంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది. ఈ పరీక్ష ప్రైవేట్‌లో చేయించుకుంటే పరీక్ష రకాన్ని బట్టి మూడు వేల నుంచి 15 వేల రూపాయల వరకు ఖర్చవుతుంది. ప్రభుత్వం స్పందించి జిల్లా జనరల్ ఆసుపత్రిలో ఎంఆర్ఐ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం....

డాక్టర్ వీరారెడ్డి, జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్



జిల్లా జనరల్ ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరాము. కలెక్టర్ అందుకు అవసరమయ్యే నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తున్నారు.

జాగీర్‌పల్లికి సుస్తీ

- ప్రబలుతున్న విషజ్వరాలు
- నాలుగు సంవత్సరాల చిన్నారికి డెంగ్యూ



జాగీర్‌పల్లిలో డ్రైనేజీలో పెరిగిన గడ్డి

సైదాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగీర్‌పల్లి గ్రామంలో జ్వరాలు ప్రబలు తున్నాయి. గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించకపోవడంతో రోడ్ల వెంట, డ్రైనేజీల్లో మురుగు నీరు పేరుకుపోయి దోమలు ప్రబలుతు న్నాయి. నాలుగు సంవత్సరాల చిన్నారికి డెంగ్యూ పాజిటీవ్ రావడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఏకధాటిగా వర్షాలు కురుస్తుం డడంతో దోమలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీల్లో నుంచి తీసిన చెత్త, మట్టి రోడ్లపై వదిలేయడంతో రోడ్లు కంపుకొడుతున్నాయి. స్థానిక అధికారులకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీల్లో చెత్తా చెదారం పేరుకుపోయి గడ్డి పెరిగింది. దీంతో మురుగు నీరు నిలిచిపోయింది. జాగీర్‌పల్లిలో ఆరు నెల లుగా వీధి దీపాలు వెలగడం లేదు. సాయంత్రం అయితే చాలు వీధులు చీకటిమయంగా మరుతు న్నాయని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా ఆరోగ్య శాఖ, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



అజయ్(ఫైల్)

తిమ్మాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన ధరిపల్లి సతీష్, వాణి దంపతుల కుమారుడు ధరిపల్లి అజయ్ (20) కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు మెడికల్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 21న కొత్తపల్లిలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లిన అజయ్‌ని డ్యూటీకి ఎందుకు సరిగా వెళ్లడం లేదని వారు మందలించారు. దీంతో అజయ్ అక్కడి నుంచి వెళ్లి మన్నెంపల్లి శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

మహిళ అదృశ్యం

చందుర్తి జూలై 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గెంట్యాల అఖిల అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై రమేష్ శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన అఖిల గురువారం ఉదయం వేములవాడలో కిరాణం సామాను తీసుకురావడానికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఫోన్‌చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. చుట్టుపక్క వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్



గంజాయి విక్రేతలను అరెస్ట్ చూపుతున్న రూరల్ సీఐ మొగిలి

సిరిసిల్ల క్రైం, జూలై 25(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన సూర అజయ్(19), సూర ప్రదీప్(18)లను శుక్రవారం అరెస్టేచేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. గూడెం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు గంజాయికి అలవాటు పడిన వారికి అధిక ధరలకు విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా గూడెం పెద్దమ్మ దేవాలయం వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ముస్తాబాద్ ఎస్‌ఐ గణేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేయగా వారి వద్ద 109 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయి సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు.

● పెద్దపల్లి టౌన్ : పెద్దపల్లి రైల్వే స్టేషన్ ఏరియాలో శుక్రవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న ఇద్దరిని పట్టుకుని విచారించారు. రేకుర్తి గ్రామానికి చెందిన బండారి శివకుమార్, జంగపల్లి రామ్‌చరణ్‌లను అదుపులోకి తీసుకొని 5 వేల విలువ చేసే గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గాంధీభవన్‌లో వినతులు స్వీకరించిన కవ్వంపల్లి



గాంధీభవన్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

తిమ్మాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హైదారాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించినట్లు తిమ్మాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ క్యారాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గాంధీభవన్‌లో ఇప్పటి వరకు మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తుండగా తాజా గా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు ప్రతి రోజు ఇద్దరు ప్రజా ప్రతినిధులు గాంధీభవన్‌లో అందుబాటులో ఉండి వినతులు స్వీకరిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

అరచేతిలో పాఠ్యాంశాలు



దీక్ష యాప్‌తో విద్యార్థులకు ప్రయోజనం

అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కరీంనగర్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చదువులో రాణించే విద్యార్థులు వివిధ కారణాలతో ఒకటి, రెడు రోజులు పాఠశాలకు వెళ్లకపోతే పాఠాల్లో వెనకబడిపోతారు. వారు ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడుతుంటాయి. తిరిగి చదవాలన్నా సరిగా అర్థం కాక ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి వారి కోసం రాష్ట్ర విద్యాశాఖ దీక్ష యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా ఒకటి నుంచి పదో తరగతి పాఠ్యపుస్తకాలను క్యూఆర్ కోడ్‌తో ప్రచురించింది. దీని ఆధారంగా విద్యార్థులు చదువుల్లో రాణించవచ్చు.

క్యూఆర్ కోడ్ సాయంతో...

ఒకటి నుంచి పదో తరగతి పాఠ్యాంశాలపై పూర్తిగా పట్టు సాధించేలా విద్యాశాఖ యాప్‌ను రూపొందించింది. స్మార్ట్ ఫోన్‌లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని అర్థం కాని పాఠ్యాంశాన్ని చదివే వెసులు బాటు కల్పించింది. మొదట యాప్‌లోకి వెళ్లి అడిగిన వివరాలను నమోదు చేయాలి. పాఠ్య పుస్తకంపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సెల్ ఫోన్‌లో కోరుకున్న పాఠ్యాంశాన్ని పొందవచ్చు. వివిధ రూపాల్లో విద్యార్థుల మానసిక స్థాయికి తగినట్లు దృశ్య రూపకంగా బోధన సాగుతుంది. నవ్యత కోరే ఉపాధ్యాయులకు సృజనాత్మకంగా బోధించే విధానాలు కూడా ఇందులో ఉన్నాయి. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల అధ్యయనం, బోధనలో మెరుగులు దిద్దే ఈ విధానాన్ని అందిపుచ్చుకుంటే ఉపయుక్తంగా ఉంటుంది.

విద్యార్థులకు అవగాహన..

విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు ఉపకరించేలా ప్రభుత్వం దీక్ష యాప్‌ను రూపొందించింది. క్యూఆర్ కోడ్ సహాయంతో ఇంటి వద్ద పాఠాలను తిరిగి చూసుకోవచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీనిపై విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామంటున్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చదువుల్లో మరింత రాణించాలని సూచిస్తున్నారు.



కేజీవీల్ ట్రాక్టర్‌కు జరిమానా

ఎలిగేడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో నిబంధనలు అతిక్రమించి కేజీవీల్ ట్రాక్టర్‌ను రోడ్డుపై తీసుకెళ్లిన గడ్డం రామిరెడ్డికి జరిమానా విధించారు. శుక్రవారం నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై వెళుతుండగా పెట్రోలింగ్ పోలీసులు టీఎస్22బీ3667 నెంబర్ గల ట్రాక్టర్‌ను పట్టుకుని తహసీల్దార్‌కు బైండోవర్ చేశారు. తహసీల్దార్ రూ.5 వేల జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లకు ఈ విషయంలో పలు సూచనలు చేసినట్లు తెలిపారు. కేజీవీల్స్ వల్ల రోడ్లు దెబ్బతింటాయన్నారు.

విద్యుదాఘాతంతో ఆరు గొర్రెల మృత్యువాత

శంకరపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో విద్యుదాఘాతంతో ఆరు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. బాకారపు మొండయ్య శుక్రవారం రోజు లాగానే గొర్రెలను మేపడానికి వెళ్లాడు. మెట్‌పల్లిలో ఓ పురాతన ఇంటి వద్ద గొర్రెలు గడ్డి మేస్తూ ప్రమాదవశాత్తు తెగివున్న విద్యుత్ వైర్‌ను తాకడంతో విద్యుదాఘాతంతో మృతి చెందాయి.

హుజూరాబాద్ ఎంజేపీ గురుకులంలో కలకలం

● ఇద్దరు విద్యార్థులను కరిచిన ఎలుకలు ● ఏరియా ఆస్పత్రిలో చికిత్స

హుజూరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎంజేపీ గురుకులం హాస్టల్‌లో ఎలుకలు కలకలం సృష్టించాయి. పాఠశాలలోని ఇద్దరు విద్యార్థులను ఎలుకలు కరవడంతో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సైదాపూర్ మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను హుజూరాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేశారు. గురువారం అర్ధరాత్రి హాస్టల్‌లోని 8వ తరగతి చదువుతున్న రక్షిత్, 9వ తరగతి చదువుతున్న యశ్వంత్‌లను ఎలుకలు కరిచాయి. ఈ విషయాన్ని ఉదయం పాఠశాలకు వచ్చిన ప్రిన్సిపాల్‌కు విద్యార్థులు తెలుపడంతో వెంటనే ఆ ఇద్దరితో పాటు హాస్టల్ గదిలో ఉన్న 10మంది విద్యార్థులను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ రాణిని వివరణ కోరగా హాస్టల్‌కు సమీపంలో రైస్ మిల్లులు ఉండడంతో ఎలుకలు హాస్టల్‌లోకి వస్తున్నాయన్నారు. ఎలుకల నివారణ కోసం బోన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు క్షేమంగా ఉన్నారన్నారు.

● గురుకులాలకు నూతన భవనాలు నిర్మించాలి

రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలలకు నూతన భవనాలు నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పరిధిలోని బీసీ గురుకుల విద్యాలయాలను, సంక్షేమ హాస్టళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయన్నారు. గురుకులాలు అపరిశుభ్రంగా ఉండడం వల్ల ఎలుకలు హాస్టళ్లలోకి వచ్చి విద్యార్థులను కరుస్తున్నాయన్నారు.



హుజూరాబాద్‌లోని ఎంజేపీ గురుకుల పాఠశాల

● విచారణ చేపట్టిన అధికారులు

హుజూరాబాద్ పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల హాస్టల్‌లో శుక్రవారం రాత్రి అధికారులు విచారణ చేపట్టారు. హాస్టల్‌లోని విద్యార్థుల గదులను పరిశీలించారు. రెండు రోజుల్లో పది మంది విద్యార్థులను ఎలుకలు కరిచినట్లు నిర్ధారించుకున్నారు. హాస్టల్ పరిసర ప్రాంతాలు అభరిశుభ్రంగా ఉన్నాయని, దీంతో హాస్టల్‌లోకి ఎలుకలు వస్తున్నాయన్నారు. దీనిపై అధికారులకు నివేదిక ఇస్తామని మహాత్మా జ్యోతిరావు పూలే జాయింట్ సెక్రటరీ తిరుపతి తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

కవాడిగూడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన దోమలగూడ పీఎస్ పరిధిలోని ట్యాంక్‌బండ్‌పై జరిగింది. ఏఎస్‌ఐ చెలమయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లలో నివాసం ఉండే శ్రీనివాస్ (50)కు మతిస్థిమితం సరిగా లేదు. చికిత్స నిమిత్తం ఆయన కుమారుడు ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి తీసుకువస్తుండగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న వేమన విగ్రహం వద్ద కుటుంబ సభ్యులకు చెప్పకుండా శ్రీనివాస్ తప్పిపోయాడు. అతని కోసం కుటుంబ సభ్యులు ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి మిస్సింగ్‌పై ఆయన కుమారుడు దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చెలమయ్య తెలిపారు. శ్రీనివాస్ ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పీఎస్‌లో గానీ, ఫోన్ 8712568855కు సమాచారం అందించాలని ఏఎస్‌ఐ చెలమయ్య తెలిపారు.

నాలుగు నెలలుగా అందని 'ఉపాధి' వేతనాలు

గంగాధర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. గంగాధర మండలంలో 33 గ్రామా పంచాయతీలున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌తో పాటు మండలంలో ఏపీవో, ఈసీలు, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు. అయితే మండలంలో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి. ప్రస్తుతం గంగాధర మండల వ్యాప్తంగా 17 మంది ఫీల్డ్ అసిస్టెంట్లతోనే కాలం వెల్లదీస్తున్నారు. గ్రామంలో ఉపాధి హామీ పనులను కూలీలను నియమించి చేయించాలి. ఎఫ్ఏలు మస్టర్లలో పని వివరాలతో పాటు కూలీల సంఖ్య, కొలతలు, గ్రామంలో నర్సరీల పర్యవేక్షణ, చెట్ల పెంపకం, గ్రామ సభలు నిర్వహించి పనులను గుర్తించడం, సభల్లో రైతుల దరఖాస్తు చేసుకున్న పనులను కంప్యూటర్లలో నమోదు చేయించాల్సి ఉంటుంది. అదిగాక చేసిన పనులను ఎంబీ రికార్డు చేసి ఇంజనీరింగ్ కన్సల్టెన్సీకి నివేదించాల్సి ఉంటుంది. పనిభారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. దీనికి తోడు నాలుగు నెలలుగా ఉపాధి హామీలో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

●సంవత్సర కాలంగా ఏపీవో పోస్టు ఖాళీ: గంగాధరలో సంవత్సరం నుండి ఏపీవో లేక ఈసీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పనిచేసిన ఏపీవో దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లగా సంవత్సర కాలంగా అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది.

ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ చేపట్టాలి

భగత్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ చేపట్టాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ నెల 28న హైదరాబాద్‌లో సిట్ విచారణకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ సైతం సిట్ విచారణకు హాజరవుతారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ పేరుతో సాగదీస్తోందని పేర్కొన్నారు.

బాలుడి ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లెకు చెందిన బాలుడు (16) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తండ్రి మందలించాడని పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

మా సారూ మాకే కావాలి

కిషన్‌దాస్‌పేట ప్రాథమిక పాఠశాల వద్ద తల్లిదండ్రుల నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జూలై25,(ఆంధ్రజ్యోతి): డిప్యూటేషన్‌పై మరో పాఠశాలకు పంపిన ఉపాధ్యాయుడిని తమ పాఠశాలకే తిరిగి కేటాయించాలని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేట ప్రాథమిక పాఠశాల ఎదుట తల్లిదండ్రులు శుక్రవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. పాఠశాలలో సమావేశమైన విద్యార్థుల తల్లిదండ్రులు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రీప్రైమరీతో కలిపి 112మంది విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో కంటే విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. ఇక్కడ బోధించే ఉపాధ్యాయుడిని మరో పాఠశాలకు సర్దుబాటు చేయడంతో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువును నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి ఉపాధ్యాయుడిని తిరిగి ఇదే పాఠశాలకు కేటాయించాలని కోరారు.

అప్పు వసూలుకు ఇంటికి తాళం వేశారని

అవమానభారంతో ఆత్మహత్య

శంకరపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నంలో అప్పు ఇచ్చిన వారి వేధింపులు భరించలేక అవమానంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి చెందిన గుర్రం రామారావు (రాములు) (63) చిట్టీలు నిర్వహించే వాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన తనుకు ప్రకాష్, తనుకు లక్ష్మీనారాయణ వద్ద అవసరాల నిమిత్తం డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. దీనితో పాటు వారికి చిట్టీ సొమ్ము చెల్లించాల్సి ఉంది. వాటికి సంబంధించి వడ్డీ చెల్లిస్తున్నాడు. అయితే డబ్బులు మొత్తం ఇవ్వాలని వారు ఒత్తిడి చేస్తూ ఈ నెల 21న రామారావు ఇంటికి వచ్చి ఇంటికి తాళం వేశారు. దీనికి తోడు డబ్బు చెల్లించే పరిస్థితి లేక పోతే పురుగుల మందు తాగమని అవమానించారు. దీంతో మనస్థాపం చెంది శుక్రవారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య గుర్రం కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

బురద రోడ్డుపై వరి నాట్లతో నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

వెల్గటూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం వెంకటాపూర్ రోడ్డు వర్షానికి బురదమయం కావడంతో శుక్రవారం గ్రామస్థులు రోడ్డుపై వరి నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ చిరు జల్లులకే రోడ్డు బురదమయంగా మారుతోందని ఆవేదన చెందారు. కాలి బాటన, వాహనాలపై వెళ్లే వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డుపై ప్రయాణించాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు బాగు చేయించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన పోలీసులు

హుజూరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం బుడగజంగాల కాలనీలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు మద్యం తాగుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థుల వసతి గదులను పరిశీలించారు. గదుల్లో మద్యం సీసాలు, సిగరెట్లు దర్శనమిచ్చాయి. దీంతో పోలీసులు విచారిస్తున్నారు. హాస్టల్‌లో రాత్రి వేళలో వార్డెన్ లేకపోవడం గమనార్హం.

బిల్లులు చెల్లించక

నిలిచిన వంతెన నిర్మాణం

● యామాపూర్- ఫకీర్‌కొండాపూర్ గ్రామాల మధ్యలో వంతెన నిర్మాణం

● వర్షాకాలంలో విద్యార్థులు, రైతుల అవస్థలు



అర్ధంతరంగా నిలిచిన వంతెన నిర్మాణ పనులు

ఇబ్రహీంపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యామాపూర్-ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న వంతెన పనులు బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిపోయాయి. మండలంలోని ఫకీర్ కొండాపూర్ గ్రామానికి వెళ్లడానికి రెండు రోడ్డు మార్గాలు ఉన్నాయి. ఒకటి యామాపూర్ గ్రామం గుండా వెళ్లేదారి కాగా రెండోది మల్లాపూర్ మండలం నడికుడ గ్రామం నుంచి వెళ్లేది. ఈ రెండు రోడ్డుమార్గాల్లో లో లెవెల్ వంతెనలు ఉండడం వల్ల ప్రతీ వర్షాకాలంలో వాగుల వరద ఉధృతికి రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో ప్రతీ వర్షాకాలం విద్యార్థులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో లోలెవల్ వంతెన స్థానంలో హై లెవెల్ వంతెనల నిర్మాణానికి అప్పటి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు రెండు కోట్ల 77 లక్షల 57వేల రూపాయలు ఆర్‌అండ్‌బీ నిధులతో వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన హిమాలయ కన్‌స్ట్రక్షన్ వారు కాంట్రాక్ట్ పనులు దక్కించుకొని వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటివరకు వంతెన పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. ఐనా ఒక్క రూపాయి కూడా బిల్లులు రావడం లేదని గుత్తేదారు నిర్మాణ పనులు ఆపేశారు. మళ్లీ ఎప్పటిలాగే ఈవర్షాకాలంలో కూడా వరదలు వచ్చి రాకపోకలు నిలిచిపోతాయోమోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవంతెన నిర్మాణం పూర్తయితే పక్కనే ఉన్న నిర్మల్ జిల్లా ఖానాపూర్, కడెం తదితర ప్రాంతాలకు దూర భారం తగ్గుతుందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తాను ఇటీవలే బాధ్యతలు స్వీకరించానని, వంతెన నిర్మాణ పనుల గురించి తెలియదని, తెలుసుకొని చెబుతానని తెలిపారు.



గత వర్షాకాలం వంతెన వద్ద వరద ఉధృతి (ఫైల్)

నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి..

- సింగని మారుతి, గ్రామస్థుడు, ఫకీర్ కొండాపూర్



మా గ్రామానికి ఉన్న రెండు రోడ్డు మార్గాలు వర్షాకాలంలో వచ్చే వరదల వల్ల రాకపోకలు బంద్ అవుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు, వంతెనకు అవతల వైపు ఉన్న పొలాలకు వెళ్లే రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని వంతెన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, జూలై 25(ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం కొడిమ్యాల మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకానికి రేషన్‌కార్డు ప్రామాణికంగా ఉందన్నారు. గతంలో రేషన్ కార్డులో పేరు లేకపోవటంతో ప్రజలు చాలా మంది ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 55వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. 52 వేల రేషన్‌కార్డులు అప్రూవ్ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్‌గౌడ్, సివిల్ సప్లై ఆఫీసర్ జితెందర్‌రెడ్డి, ఫారెస్టు రేంజర్ గులాం మొయినుద్దీన్, డీఎఫ్ఆర్వో ముషీర్ అహ్మద్, పలువురు సెక్షన్ ఆఫీసర్లు, తహసీల్దార్ ఎం. కిరణ్‌కుమార్, ఎంపీడీవో స్వరూప, ఆర్ఐ కరుణాకర్, కార్యదర్శి వంశీవర్ధన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గడ్డం జీవన్‌రెడ్డి, సింగిల్ విండోల చైర్మనులు రాజనర్సిగరావు, రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్లేశంయాదవ్, చంద్రమోహన్‌రెడ్డి, అజయ్‌గౌడ్, స్వామి, రవి, జితెందర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, నర్సయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

ధర్మపురి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని షబ్బీర్ అహ్మద్ బేగ్‌కు చెందిన ద్విచక్ర వాహనం చోరీ కేసులో నిందితుడు గుర్రం కోటేశ్వర్‌రావుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ ధర్మపురి కోర్టు జుడిసియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏగి జానకి శుక్రవారం తీర్పునిచ్చారు. గత ఏడాది మే 14 న షబ్బీర్ అహ్మద్ బేగ్ తన పల్సర్ బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేసి ఉంచాడు. మరునాడు ఉదయం చూడగా కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ నిందితుడు కోటేశ్వర్‌రావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు నిచ్చారు.

వానాకాలం విద్యుత్‌తో జాగ్రత్త

- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- సొంతంగా మరమ్మతులు చేయొద్దు
- సిబ్బందికి సమాచారం ఇవ్వాలి

గణేశ్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వానాకాలం విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటాయి. వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలి. అనుభవం లేకుండా సొంతంగా మరమ్మతు చేస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. భారీ వర్షాల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

వర్షాకాలంలో ఈదురు గాలులతో చెట్లు విరిగి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సమస్యలు తలెత్తుతాయి. దీంతో రైతులు చిన్నచిన్న మరమ్మతులు చేస్తుంటారు. అలాంటి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ల ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోక విద్యుదాఘాతానికి గురై అవకాశాలు ఎక్కువ. ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతు చేయాల్సి వస్తే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.





● పాటించాల్సిన ముఖ్యాంశాలు

ఎర్తింగ్ తప్పకుండా చేసుకోవాలి. వర్షం కురిస్తే స్విచ్ బోర్డు తడవకుండా జాగ్రత్తపడాలి. ట్రాన్స్‌ఫార్మర్, స్టార్టర్ బాక్స్ చుట్టూ పిచ్చి మొక్కలు, పొదలు పెరగకుండా చుడాలి. ఎలాంటి పరిస్థితిల్లోనూ తెగిన విద్యుత్ తీగలను తాకవద్దు. విద్యుత్ సిబ్బంది వచ్చే వరకు వాటి చుట్టూ ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలి. మూగజీవాలను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లకుండా ఉండేలా చూసుకోవాలి. రైతులు, వినియోగదారులు సొంతంగా విద్యుత్‌కు సంబంధించిన పనులు చేయొద్దు. కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం. గ్రామీణ వినియోగ దారులు తమ పరిధిలోని క్షేత్ర స్థాయి విద్యుత్ సిబ్బంది లైన్‌మన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్‌ను సంప్రదించాలి.

అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు



వచ్చే మూడు రోజులు అతి భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు, ముఖ్యంగా రైతులు విద్యుత్‌పై జాగ్రత్త వహించాలి. విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. తడి చేతులతో విద్యుత్ పరికరాలు, తీగలు, స్విచ్‌లను తాకకూడదు. ట్రాన్స్ ఫార్మర్లు, స్టార్టర్ బాక్సులు, మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారు.

\- మేక రమేష్‌బాబు, టీజీఎన్‌పీడీసీఎల్, ఎస్ఈ

అత్యవసర సమయంలో ఫోన్ చేయాల్సిన నంబర్లు

ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తితే టీజీఎన్‌పీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబరు 1912కు సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు. నగరంలోని సంబంధిత అధికారులు, ఫ్యూజ్ ఆఫ్‌కాల్ నంబర్లు అందుబాటులో ఉంచారు.

ఏఈలు		ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సిబ్బంది
టౌన్-1	8712483242,	8712483237
టౌన్-2	8712483270	7036117117
టౌన్-3	8712483215	8712483243
టౌన్-4	8712483276	8712483247
టౌన్-5	8712483251	8712483248
టౌన్-6	8712483280	8331012624
టౌన్-7	8712483284	9912225700
టౌన్-8	8712483256	9491011885
టౌన్-9	8712483289	8712483285

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్

కరీంనగర్ అర్బన్, జూలై (ఆంధ్రజ్యోతి):తెలంగాణలోని ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించారు. ఈయన గతంలో కరీంనగర్ కలెక్టర్‌గా పనిచేశారు. కొద్ది రోజుల క్రితం ప్రత్యేక అధికారులను నియమించిన ప్రభుత్వం మళ్లీ కొద్ది మార్పులతో తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

తిరుపతి రైలుకు ఎల్‌హెచ్‌బీ బోగీలు..

ఈ నెల 27 నుంచి పట్టాలపై పరుగులు

పెద్దపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎల్‌హెచ్‌బీ (లింక్ హాఫ్‌మన్ బుష్) బోగీలతో ఈ నెల 27 నుంచి తిరుపతి రైలు పట్టాలు ఎక్కనున్నది. 12761 నంబర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 26న తిరుపతి నుంచి బయలుదేరనున్నది. 27న రాత్రి కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లనుంది. ఇప్పటి వరకు ఈ రైలుకు ఐసీఎఫ్ (ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ) బోగీలు ఉన్నాయి. ఇక నుంచి ఎల్‌హెచ్‌బీ (ఎరుపు రంగు గలవి) బోగీలతో నడవనున్నాయి. ఈ రైలులో మొత్తం 19 బోగీలు ఉంటాయి. ఆరు స్లీపర్ బోగీలు,



ఐదు త్రీ టైర్ ఏసీ బోగీలు, మూడు టు టైర్ బోగీలు, నాలుగు జనరల్ బోగీలు, ఒక దివ్యాంగుల బోగీతో నడవనున్నది. ఎల్‌హెచ్‌బీ బోగీలు గరిష్ఠంగా 160 కిలోమీటర్ల వేగంతో, ఐసీఎఫ్ బోగీలు 110 కి.మీ వేగంతో నడుస్తాయి. కరీంనగర్ నుంచి పెద్దపల్లి వరకు 110 కి.మీ, పెద్దపల్లి నుంచి తిరుపతి వరకు 130 కి.మీ. వేగంతో ఈ రైలును నడపనున్నారు.

ఎస్సారెస్పీకి స్వల్ప వరద

ప్రాజెక్టులోకి 2,605 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం స్వల్పంగా వరద చేరింది. డ్యామ్‌లోకి 2,605 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 21.541 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 25.960 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 622 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 11.744 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 2.991 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

ఆలయాల్లో శ్రావణ సందడి

- వేములవాడలో మహాలక్ష్మి అమ్మవారికి ఒడి బియ్యం
- ధర్మపురిలో ప్రారంభమైన ఉత్సవాలు ● కొండగట్టులో అభిషేక అర్చనలు



వేములవాడలో స్వామివారి దర్శనానికి క్యూలో భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం శుక్రవారం శ్రావణ శోభను సంతరించుకుంది. శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా రాజన్న ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఆయా క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు ముందుగా పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. గండాలు తొలగిపోవాలని గండాదీపంలో నూనె పోసి శ్రీస్వామి వారిని వేడుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు బద్దిపోచమ్మను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహాలక్ష్మి అమ్మవారికి విశేషపూజలు..

శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా రాజరాజేశ్వరి అమ్మవారికి ఉదయం, సాయంత్రం విశేషపూజలు నిర్వహించారు. శ్రీమహాలక్ష్మి అమ్మవారికి షోడశోపచార పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు మహాలక్ష్మి అమ్మవారికి నూతన వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ధర్మపురిలో మంత్రి అడ్లూరి పూజలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. శ్రావణమాసం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. నది వద్ద సైతక లింగాలు చేసి పసుపు, కుంకుమ చల్లి, కొబ్బరికాయలు కొట్టి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అన్ని ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. రాత్రి వరకు ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. గోదావరి నదీ తీరాన గల ఆలయాల్లో భక్తులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు పాల్గొన్నారు. ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. స్వామి సన్నిదిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.

కొండగట్టులో సప్తాహ ఉత్సవాలు...

మల్యాల: కొండగట్టు అంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస సప్తహ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఆలయ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేక అర్చనలు నిర్వహించారు. సాయంకాలం అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, వెంకటేశ్వరస్వామికి తిరువీధి సేవ నిర్వహించిన అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ ఉత్సవాలలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, సునీల్, స్థానాచార్యులు కపీంధర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతీ ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.





ఆలయంలో సంకల్పాది పూజలు చేస్తున్న అర్చకులు, కొండగట్టులో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

క్రీడలతో స్నేహ సంబంధాలు

- కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ వెలిచాల రాజేందర్‌రావు
- సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ పోటీలు ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయని కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ వెలిచాల రాజేందర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జగిత్యాల రోడ్‌లో వివేకానంద రెసిడెన్షియల్ (సీబీఎస్ఈ) పాఠశాలలో శుక్రవారం సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలుర కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాల 42 ఏళ్లుగా ఉన్నతమైన విద్యతోపాటు అన్ని రకాల క్రీడలను ప్రోత్సహించడం గర్వకారణమన్నారు. అండర్-14, 17, 19 విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లకు రూ.10 వేల చొప్పున, ద్వితీయ స్థానం జట్లకు రూ.8 వేల చొప్పున, మూడో స్థానంలో నిలిచిన జట్లకు రూ.5 వేల చొప్పున నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు. రానున్న రోజుల్లో కరీంనగర్‌లో జాతీయ స్థాయి క్రీడలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ అమిత్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహద పడుతాయన్నారు. వివేకానంద అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ టి. లలిత కుమారి మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, సొంత నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీహెచ్ సంపత్‌రావు, జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి బి.మల్లేష్‌గౌడ్, సీబీఎస్ఈ పరిశీలకులు ఎల్. వెంకటరమణ, పాఠశాల చైర్మన్ డాక్టర్ పొల్సాని సుధాకర్‌రావు, ప్రిన్సిపాల్ బలివాడ రేణుక, పాఠశాల కమిటీ సభ్యులు గంద్ర లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రయాణ ప్రాంగణం గుంతలమయం

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



వెల్గటూర్ బస్టాండ్‌లో గుంతలు

వెల్గటూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వెల్గటూర్ ప్రయాణ ప్రాంగణం గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు వచ్చి నపుడు తొందరగా ప్రయాణికులు ఎక్కడానికి ప్రయత్నిస్తే గుంతలో పడే ప్రమాదం ఉంది. మండల కేంద్రంలో నిత్యం బస్సులు నడిచే ప్రయాణ ప్రాంగణాన్ని పట్టించుకునే నాథుడు లేడని ప్రయాణికులు మండి పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై బస్టాండ్ కంట్రోలర్ బండారి సత్తయ్యను వివరణ కోరగా సమస్యను ఆర్టీసీ అధికారులకు దృష్టికి తీసుకవెళ్లామని అన్నారు. స్థానిక నాయకులు, వ్యాపారస్తులు బస్టాండ్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రేపు అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం

కరీంనగర్ అర్బన్, జూలై 25 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్, జగిత్యాల, గంగాధర (మధురనగర్) బ్రాంచ్‌ల సహకార అర్బన్ బ్యాంక్ 42వ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న కరీంనగర్ టీఎన్ జీఓస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి గడ్డం విలాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు టీఎన్జీ ఓస్ ఫంక్షన్ హాల్ నిర్వహించే సమావేశానికి సభ్యులు హాజరుకావాలని, బ్యాంకు అభివృద్ధి కోసం సమర్పించే ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదించాలని కోరారు.

త్యాగాల స్మృతి చిహ్నం.. వైజయంతి యుద్ధ ట్యాంక్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కార్గిల్ పర్వత ప్రాంత్రాన్ని ముట్టడించిన పాకిస్థాన్ చొరబాటుదారులను భారత్ సైన్యం తరిమికొట్టింది. 1999 జూలైలో జరిగిన ఇండో-పాకిస్థాన్ యుద్ధంలో భారత్ సైన్యం త్యాగాలకు ప్రతి రూపంగా సిరిసిల్లలో త్యాగాల స్మృతి చిహ్నం ఏర్పాటు చేశారు. 2004లో కార్గిల్ వీరుల స్మృత్యార్థం సిరిసిల్లలోని వర్ధనకుంటను కార్గిల్ లేక్‌గా అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కార్గిల్ లేక్‌లో యుద్ధ సమ యంలో ఉపయోగించిన వైజయంతి యుద్ధ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. సిరిసిల్ల-కామారెడ్డి రహదారి పక్కన ఉన్న వర్ధనకుంటకు కార్గిల్‌లేక్‌గా నామకరణం చేసిన అప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా సీహెచ్ విద్యాసాగర్‌రావు కార్గిల్ యుద్ధంలో ఉపయోగించిన 45 టన్నుల వైజయంతి యుద్ధ ట్యాంక్‌ను సిరిసిల్లకు తీసుకువచ్చారు. యువతలో దేశభక్తిని పెంపొందించడానికి, అమరసైనికులకు నివాళులు తెలుపుతూ ఏర్పా టు చేశారు. ఇప్పు డు సిరిసిల్లకు ప్రత్యేక ఆకర్షణగా యువకులు, విద్యార్థులు, సైనికుల కు స్ఫూర్తినిచ్చే విధంగా మారింది. కార్గిల్ లేక్ విజయానికి స్ఫూర్తిగా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను దేశ వ్యాప్తంగా జరుపుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారుల విస్తరణ, ప్రధాన కూడళ్ల సుందరీకరణలకు పూనుకున్నారు. దీంతో పాటు కార్గిల్‌లేక్ వద్ద వైజయంతి యుద్ధట్యాంక్ ప్రాంతాన్ని రూ.21 లక్షలతో పురపాలక సంఘం అభివృద్ధి చేసింది. చుట్టూ ప్రహరీ, చెట్లతో తీర్చిదిద్దారు. బీజేపీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను నిర్వహిం చడానికి ఏర్పాట్లు చేశారు.



నిరుపేదల సమస్యలపై ఎమ్మార్పీఎస్ పోరాటం

రేవంత్‌రెడ్డి సర్కార్‌తో తాడోపేడో తేల్చుకుంటాం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణమాదిగ

గోదావరిఖని, జూలై 25(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సమస్యలపై ఎమ్మార్పీఎస్ పోరాడుతుందని, దేశంలో ఎదురయ్యే సవాళ్ళనే ఎదుర్కొవడమే తన భవిష్యత్ ప్రయాణమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ అన్నారు. సింగరేణి మాదిగ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మార్కండేయకాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో ప్రసంగిం చారు. ఏబీసీడీ వర్గీకరణ కోసమే కాకుండా సమాజంలో అన్ని వర్గాల నిరుపేదల సమస్యలపై ఎమ్మార్పీఎస్ పోరాటం చేసి పరిష్కరించిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఎన్నో వాగ్ధానాలు నిలబెట్టుకోవడం లేదన్నారు. వికలాంగులకు, వితంతులకు పెన్షన్లు పెంచలేదని, కనీసం ఇవ్వాల్సిన పెన్షన్ల ఇంత వరకు ఇవ్వడం లేదని, ఈ విషయంలో ప్రతిపక్షం ప్రశ్నించడం లేదన్నారు. ఐదేళ్ళుగా కొత్త పెన్షన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పేద వర్గాల సమస్యలే ఎమ్మార్పీఎస్ ఏజెండాగా మారుతుందని, ఆగస్టు 13న వికలాంగుల, వృద్ధుల, వితంతుల పెన్షన్ల కోసం మహాగర్జన నిర్వహిస్తామని, హామీ ఇచ్చిన ప్రకారం ఇప్పటికైనా పెన్షన్ పెంచుతావా లేకపోతే రాజీనామా చేసి పోతావా అనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తేల్చుకోవడం కోసమే మహాగర్జన నిర్వహిస్తున్నామని తెలిపారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మందకృష్ణ

తనకు పద్మశ్రీ ఏబీసీడీ వర్గీకరణతో రాలేదని, 30 ఏళ్లు ఎమ్మార్పీ ఎస్ చేసిన సామాజిక పోరాటాలకు కేంద్రప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు అన్నారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, మాజీ ఎంపీ వెంకటేష్‌నేత, తిరుపతి, యాదగిరి సత్తయ్య, బొంకూరి శంకర్, తిరుపతి, పాముకుంట్ల భాస్కర్, యుగేందర్, బాలసాని స్వామిగౌడ్, కాసిపేట శివాజీ, ప్రసాద్, దళిత సంఘాలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ శిబిరం

భగత్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. శుక్రవారం 'ఆరోగ్యం-ఉద్యోగం' అనే అంశంపై వీడియో కాన్ఫరెన్స్‌లో వివ రించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏపీ గిరిసింహా రావు కంటి చూపుపై పొగాకు, మందు ప్రభావాన్ని వివరించారు. పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ శంకరయ్య, సైకాలజిస్టు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

● న్యూస్‌బాక్స్..

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చలో గోవా పోస్టర్‌ను మండలంలోని దుర్శేడ్ గ్రామంలో బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషిని మాట్లాడుతూ ఆగస్టు 7న గోవాలో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ 10వ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. బీసీ మహిళా ఉపాధ్యక్షురాలు వీరగోని వరలక్ష్మి, భారతి, అరుణ, అనిత, భాగ్యలక్ష్మి, సులోచన, రాజేశ్వరి, శ్రీమతి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జమ్మికుంట రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని పాత వ్యవసా య మార్కెట్ యార్డులో తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులు మారేపల్లి చందర్, కార్యదర్శి పులికోటి సదా నందం, ఉపాధ్యక్షులు కనకం భాగ్య, పూదరి స్వామి, సహాయ కార్యదర్శి మంచాల స్టీఫెన్ రాజు, కోశాధికారులు ఎ లక్ష్మి, కె లక్ష్మిలు, ప్రచార కార్యదర్శి రావుల రాజయ్య, బోయిని లక్ష్మి ఎన్నుకున్నారు.

ఉచిత వైద్య శిబిరం

జమ్మికుంట రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల సందర్భంగా ఈ నెల 27న జమ్మికుంటలో ఉచిత రక్తనాళాల వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు సత్య సాయిసేవా సమితి కన్వీనర్ గన్ను సతీష్ కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం

గంగాధర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి నరేంద్ర విద్యాలయం విద్యార్థులు అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం అందించారు. పెద్దపెల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన బాలల సంరక్షణ సంస్థ ప్రతినిధులు పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదించారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారంతో పది వేలు పోగు చేసి అనాథ పిల్లలకు అందించారు. ఈ సందర్భంగా సామాజిక బాధ్యతగా గుర్తించి విరాళం అందించిన పాఠశాల విద్యార్థులను సంస్థ ప్రతినిధులు అభినందించారు.

ఓటరు జాబితా పరిశీలనకు కసరత్తు


ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఎంపీవో

- పంచాయతీ కార్యదర్శులకు లాగిన్

కరీంనగర్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్ జాబితాను మరోసారి పరిశీలించాలని ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొత్త దరఖాస్తులు, మృతి చెందిన వారి పేర్ల తొలగింపు వంటి వాటిని పరిశీలించనున్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి తుది ఓటరు జాబితాను గతేడాది సెప్టెంబరులోనే ప్రకటించారు. ఎన్నికల ప్రకటన వెలువడే సమయానికి మరోసారి ఓటర్ జాబితను పరిశీలించడానికి పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేకంగా లాగిన్ ఇచ్చారు. దీంతో వారు టీ-పోల్‌లో ఆయా గ్రామాల్లోని వార్డుల వారీగా ఓటరు జాబితాను రూపొందించడంతోపాటు గతంలో తప్పులను సరిదిద్దుతూ జాబితాను సిద్దం చేయడానికి సన్నద్ధం అవుతున్నారు. కరీంనగర్ మండలంలో మొత్తం 17 గ్రామ పంచాయతీలు ఉండేవి. దుర్శేడ్, గోపాల్‌పూర్, బొమ్మకల్ కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమవగా 14 ఉన్నాయి. మొత్తం 22వేల 80 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 10వేల 904 మంది ఉండగా స్త్రీలు 11,175 మంది ఉన్నారు. ఒకరు ట్రాన్స్ జెండర్ ఉన్నారు. ఇటీవల కొందరు కొత్తగా ఓటు హక్కు పొందారని, మరి కొందరు మరణించారని మార్పులు చేర్పులకనుగుణంగా నూతన జాబితాను ప్రచురించనున్నట్లు ఎంపీవో జగన్మోహన్ తెలిపారు.

అల్ఫోర్స్‌లో శ్రావణమాస ప్రారంభోత్సవం

భగత్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో శ్రావణమాస ప్రారంభోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం శివుడికి అత్యంత ప్రీతికరమైందని, మాసంలో అనేక రకాలైన పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి

గాంధీభవన్‌లో వినతుల స్వీకరణ

తిమ్మాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హైదారాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించినట్లు తిమ్మాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రకటనలో తెలిపింది. గాంధీభవన్‌లో ఇప్పటి వరకు మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తుండగా తాజాగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు ప్రతీ రోజు ఇద్దరు ప్రజా ప్రతినిధులు గాంధీభవన్‌లో అందుబాటులో ఉండి వినతులు స్వీకరిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొంది.

సైకిళ్ల పంపిణీ

జమ్మికుంట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలగాని రాజు చేతుల మీదుగా 13మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీని వాస్, బల్సుకూరి రాజేష్, రాచపల్లి ప్రశాంత్, రాసమల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు, బూజునూర్, మల్యాల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి, స్థానిక బీజేపీ శ్రేణులు శుక్రవారం సైకిళ్లను పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు రాంబాబు, శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, షిరాజ్ అహ్మద్ ఖాన్, సాంబయ్య, లింగారెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్, గోపాల్, పవన్ రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

హుజూరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్ర మంత్రు లు ఢిల్లీకి వెళ్లిన సందర్భాన్ని ఆసరాగా చేసు కొని మాట్లాడడం సరికాదని అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు.

ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే

చొప్పదండి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శుక్రవారం చొప్పదండి పట్టణంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ మోసపూరిత 420 హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఉత్తమ సొసైటీ అవార్డును అందుకున్న చొప్పదండి సంఘం చైర్మన్ వెల్మ మల్లారెడ్డిని ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ మినుపాల తిరుపతిరావు, పార్టీ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

కరీంనగర్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గందె రామారావు కల్యాణ మండపంలో స్థానిక ఎన్నికలపై పార్టీ నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయక చతికల పడిందని, గతంలో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజలకు దూరమైందని అన్నారు. ప్రస్తుతం ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని రుద్రారం, రంగసాయిపల్లి, దత్తోజిపేట, లక్ష్మీపూర్, కిష్టంపల్లి, వెంకట్రావుపల్లి బూత్ కమిటీల ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు జాడి బాల్‌రెడ్డి సమావేశం నిర్వహించారు.

సైదాపూర్: శుక్రవారం సైదాపూర్ మండల కేంద్రంలోని ఎల్ఎస్‌సీఎస్ పంక్షన్ హాల్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు దెంచనాల శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

ఆకట్టుకున్న 'టెడ్ ఎడ్ టాక్స్'

కరీంనగర్ అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం 'టెడ్ ఎడ్ టాక్స్' కార్యక్రమం నిర్వహించారు. గతేడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అంతర్జాతీయ వేదికపై ఇంగ్లీష్‌లో మాట్లాడేందుకు శిక్షణ ఇచ్చేలా కలెక్టర్ పమేలాసత్పతి, పారమిత విద్యాసంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులోభాగంగా ఇప్పటివరకు ఆరుగురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు టెడ్ జాతీయ వేదికపై ప్రసంగించారు. శుక్రవారం ప్రభుత్వ, పారమిత పాఠశాలల విద్యార్థులు కలెక్టరేట్ ఆడిటోరియంలో పలు అంతర్జాతీయ వేదికల్లో మాట్లాడారు. జడ్పీహెచ్ఎస్ కొత్తపల్లి నుంచి 9వ తరగతి చదువుతున్న ఎన్.అక్షయ, జడ్పీహెచ్ఎస్ చల్లూరు నుంచి 10వ తరగతి చదువుతున్న విష్ణు, టీజీఎంఎస్ గంగాధర నుంచి 9వ తరగతి చదువుతున్న, శ్రీవల్లి, జడ్పీహెచ్ఎస్ ఘర్షకుర్తి నుంచి పదోతరగతి విద్యార్థి రితిక ప్రతిభ చాటారు. పారమిత విద్యాసంస్థలో 9వ తరగతి విద్యార్థులు రితీష, విజ్ఞత, 8వ తరగతి విద్యార్థి లాస్య, పదోతరగతి విద్యార్థి అక్షత, 9వ తరగతి విద్యార్థులు నిత్య, చైత్య ప్రసంగించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాద్‌రావు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పారమిత పాఠశాలల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ తనిఖీ

తిమ్మాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌ను కరీంనగర్ అడిషనల్ డీసీపీ భీమారావు శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలం వివరాలను తెలుసుకొని సర్వే చేయించాలని ఆదేశించారు. రికార్డులను, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తిమ్మా పూర్ సీఐ సదన్‌కుమార్, ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్, ఆర్ఎస్సై తిరుపతి ఉన్నారు.

రైతులకు అవగాహన

గన్నేరువరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారువెల్ల గ్రామంలోని రైతులకు ఎరువుల వాడకంపై కేంద్ర వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, కేంద్ర వ్యవసాయ అధికారులు వెంకటరెడ్డి, అన్నప్ప, బసవన్న, ఏఈవో అనూష పాల్గొన్నారు.

రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌లో ప్రపంచ ఐవీఎఫ్ వేడుకలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

సుభాష్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని రెనే హస్పిటల్ రజనీ ఫెర్టిలిట్ సెంటర్‌లో శుక్రవారం ఆస్పత్రి అధినేత, ప్రొఫెసర్ డాక్టర్ బంగారిస్వామి, రజనీ ఫెర్టిలిట్ సెంటర్ అధినేత డాక్టర్ బంగారి రజనీప్రియదర్శిని ఆధర్యంలో ఐవీఎఫ్, ఎంబ్రియోలజీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సరసిజ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రెనే హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ బంగారి రజనీప్రియదర్శిని మాట్లాడుతూ అసిస్టెంట్ రిప్రొడక్టివ్ ట్రీట్‌మెంట్‌లోని వివిధ రకాల అత్యాధునిక వైద్య విధానాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది పిల్లలు లేని దంపతులకు పిల్లలు కలిగారన్నారు. వరల్డ్ ఐవీఎఫ్, ఎంబ్రియాలజీ డే సందర్భంగా రజనీ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా నూతనంగా రెండు ఎంబ్రియాలజీ క్రష్ కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. శాతవాహన లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి సురేందర్, మహేందర్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ దినకర్, రజనీ ఫెర్టిలిటీ సెంటర్ చీఫ్ ఎంబ్రాలజిస్టు రాజేందర్, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై కాంగ్రెస్ ఫిర్యాదు

వీణవంక, జూలై25(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని దీనిపై కేసు నమోదు చేయాలని మండ ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి నాయకులు ఎస్ఐ ఆవుల తిరుపతికి ఫిర్యాదు చేశారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం

చొప్పదండి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నపల్లి పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా పచ్చునూరి ఆంజనేయులు, ముఖ్య సలహాదారులుగా గ్యాజంగి రాములు, ఉపాధ్యక్షులు బిల్ల రమేష్, గ్యాజంగి మహేష్, ప్రధాన కార్యదర్శి అలిశెట్టి ఇస్తారయ్య, కార్యదర్శి సిరిపురం మల్లేశం, కోశాధికారిగా గ్యాజంగి కైలాసం, కార్యవర్గ సభ్యులతను కార్యవర్గాన్ని ప్రకటించారు.

షాపుల్లో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

వీణవంక, జూలై25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసులు కిరాణాషాపులు, పాన్ షాపుల్లో నార్కోటిక్ పదార్థాలు గుర్తించేందుకు ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. శుక్రవారం వారసంత కావడంతో పోలీసుల తనిఖీలతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వ్యాపార సముదాయాలు వారి ఇళ్లలోనూ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో ఎలాంటి మత్తు పదార్థాలు దొరకలేదని పోలీసులు తెలిపారు. తనిఖీలలో ఎస్ఐ ఆవుల తిరుపతి, సిబ్బంది రఘుపతి, ప్రణయ్ తదితరులున్నారు.

గిరి ప్రదక్షిణకు తరలిన భక్తులు

రామడుగు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సిద్ధిపేట జిల్లా కొమురవెల్లి దేవస్థానం గిరి ప్రదక్షిణకు మండలం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్లారు. గుండిగోపాల్‌రావుపేటకు చెందిన మేకల మల్లేశం, మేకల కొమురయ్య, మేకల పెద్ద కోటి, మేకల కోటయ్య కళాబృందం ఆధ్వర్యంలో తరలివెళ్లి గిరి ప్రదక్షిణ నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థులకు ఔషధ గుళికలు

జమ్మికుంట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని వెంకటాద్రినగర్‌లో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో 175మంది విద్యార్థులకు శుక్రవారం ఔషధ గుళికలు వేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముక్క జితేందర్‌గుప్తా, గుడిపాటి వీరారెడ్డి, శంకర్‌రెడ్డి, అంతం రాజిరెడ్డి, శీలం శ్రీనివాస్, పోల్సాని సంపత్‌రావు, ఎదులాపురం వెంకటేష్, ఎలవేని సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై పోలీసుల ప్రత్యేక నిఘా

చిగురుమామిడి, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలను అరికట్టడానికి పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండలంలోని ఇందుర్తి, చిన్నముల్కనూర్, సుందరగిరి, చిగురుమామిడిలో గంజాయి వాడకం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో ఈ గ్రామాల్లో పలు సంఘటనలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. చిన్నముల్కనూర్ మోడల్ స్కూల్ పరిసరాల్లో నిఘాను మరింత పటిష్ఠం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. వ్యవసాయ బావుల వద్ద, పశువుల పాకల్లో కొంతమంది యువకులు గంజాయి తీసుకుంటున్నట్లు పోలీస్‌లకు సమాచారం ఉంది.

తనిఖీ చేస్తున్నాం : ఎస్సై సాయికృష్ణ

మండల వ్యాప్తంగా డ్రగ్స్ తీసుకునే వారి జాబితా సేకరించాం. ప్రతిరోజు తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతాం.

గ్రామాల్లో కుక్కల భయం

కరీంనగర్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తిలో కుక్కలతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. గుంపులుగా రహదారి పక్కనే పడిగాపులు కాస్తున్నాయని, దుర్శేడ్ మీదుగా చేగుర్తికి వచ్చే రహదారి వెంట వీటి బెడద తీవ్రంగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. దాదాపు పదిచోట్ల కుక్కల గుంపును తప్పించుకొని గ్రామానికి చేరుకోవాల్సి వస్తోందని తెలిపారు. పొలం పనులకు వెళ్లేవారి వెంట పడుతున్నాయని, తప్పించుకొని ఇంటికి చేరుకుంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవతీసుకొని కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.


రోడ్డుపై కుక్కల గుంపు

గ్రామాల్లో కొనసాగుతున్న జ్వర సర్వే

- 90 మంది గుర్తింపు


నిల్వనీటిని తొలగిస్తున్న మండల వైద్యాధికారి

కరీంనగర్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలో జ్వర సర్వే కొనసాగుతోంది. చామనపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆరోగ్య వివరాలను సేకరిస్తున్నారు. జ్వరం వచ్చిన వారిని గుర్తించి వారికి వైద్య సేవలను అందిస్తున్నారు. ఎక్కువగా జ్వరం ఉంటే జిల్లా ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. చామనపెల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరు సెంటర్లు పని చేయగా ఇందులో తొమ్మిది మంది ఏఎన్ఎంలు, 24మంది ఆశవర్కర్లు పని చేస్తున్నారు. వీరు ఇప్పటి వరకు 5,200 ఇళ్లల్లో 16వేల మందికి పైగా ప్రజల ఆరోగ్య వివ రాలు తెలుసుకున్నారు. 90 మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల మొదటి వారంలో సర్వే ప్రారంభించినట్లు, వచ్చే నెలాఖరువరకు కొనసాగనున్నట్లు పీహెచ్‌సీ వైద్యుడు మనోహర్ తెలిపారు.

చినుకు పడితే చిత్తడి


బురదమయమైన దేవంపల్లి-గంగిపల్లి రోడ్డు

మానకొండూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవంపల్లి-గంగిపల్లి మధ్య ఉన్న రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతలు పడి అధ్వానంగా మరింది. కాలనీవాసులు బురదలో నుంచి వెళ్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పేరుకే నిషేధం..

(5వ పేజీ తరువాయి)

ల్సిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏ పాన్‌షాపు, కిరాణం షాపు చూసినా గుట్కా పాకెట్లు వేళాడుతూ దర్శనమిస్తాయి. రెండు రూపాయలకు లభించే గుట్కా ప్యాకెట్‌ను ప్రస్తుతం మార్కెట్‌లో 10 నుంచి 15 రూపాయలకు విక్రయిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నిషేధిత గుట్కా విక్రయాలను అరికట్టడానికి ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏసీ కార్యాలయ ఆవరణలో వనమహోత్సవం

కరీంనగర్ కల్చరల్ జూలై (ఆంధ్రజ్యోతి) 25: నగరంలోని ప్రశాంతనగర్ దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ నాయిని సుప్రియ మొక్కలు నాటారు. ఇతర ఆలయాల్లోనూ ఈవోలు, అర్చకులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మానసాదేవి ఆలయంలో శ్రావణ శోభ

గన్నేరువరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయానికి శుక్రవారం శ్రావణమాసం ప్రారంభమైన సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయంలో శ్రావణ శోభ సంతరించుకుంది. అమ్మవారిని నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణం సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేపట్టారు.

వీణవంక: మండల కేంద్రంలోని శివాలయంలో శ్రావణ మాసం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణశుక్రవారం కుంకుమార్చన, వరలక్ష్మీవ్రతం చేపట్టారు.

మున్సిపల్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ కట్ట సుమన్

కరీంనగర్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ మెడికల్ హెల్త్ ఆఫీసర్‌గా డాక్టర్ కట్ట సుమన్ శుక్రవారం విధుల్లో చేరారు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ఆయన శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ని కలిశారు. సానిటరీ సూపర్ వైజర్లుగా టి.అనిల్ కుమార్, శ్యాంరాజ్ విధుల్లో చేరారు. హుజూరాబాద్ మున్సిపాలిటీలో సానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న అనిల్ కుమార్‌కు, వరంగల్‌లో సానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న శ్యాంరాజ్‌కు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ కరీంనగర్‌కు బదిలీ చేసింది.

శిశుమందిర్‌లో వ్యాసరచన పోటీలు


విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కరీంనగర్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సరస్వతి శిశుమందిర్ హైస్కూల్‌లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సెల్ఫ్ రిలయంట్ ఇండియా అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సముద్రాల రాజమౌళి, కార్యర్శి కోల అన్నారెడ్డి, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, తణుకు మహేష్, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్‌రావు, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్, గోలి పూర్ణచందర్ ఉన్నారు.

ఓబీసీ న్యాయ సమ్మేళనంలో వైద్యుల అంజన్‌కుమార్

కరీంనగర్ అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కాంగ్రెస్ శుక్రవారం నిర్వహించిన ఓబీసీ న్యాయ సమ్మేళనానికి జిల్లా నుంచి టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ హాజరయ్యారు. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్‌తో కలిసి ఢిల్లీకి వెళ్లారు. ఢిల్లీలోని తాల్కటోర స్టేడియంలో సమ్మేళనం నిర్వహించారు. అణగారిన వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక అభ్యున్నతి కోసం శక్తివంతమైన ఓబీసీ ఉద్యమంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్లపైనాయకులు రాహుల్‌గాంధీతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్

కరీంనగర్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల కోసం జూలై 31వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాలతి శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరు కావాలని కోరారు. సీట్లను మెరిట్ ప్రకారం కేటాయించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు బిర్లా స్కూల్ విద్యార్థిని ఎంపిక

కరీంనగర్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 3,4 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థిని అద్యారెడ్డి ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సుంకరి మురళీధర్ తెలిపారు. అండర్ 14 బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ డాక్టర్ బబిత విశ్వనాథన్, కోచ్ గౌతంరెడ్డి అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలి

గణేశ్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్ యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్ల అవుతున్నా ప్రభుత్వాలు విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. అద్దె భవనాలు శిథిలావస్థల్లో ఉన్నాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీకాంత్. బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి దుబ్బాసి ప్రణీత్ పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు చేపట్టాలి

భగత్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అనభేరి ప్రభాకర్‌రావు, బద్దం ఎల్లారెడ్డి విగ్రహాల చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి కోరారు. శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం అధ్యక్షుడికి సన్మానం

చొప్పదండి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల రజక సంఘం అధ్యక్షుడిగా నియమితులైన మావురపు రాములపు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్‌రెడ్డి, నాయకులు పెరుమాండ్ల గంగయ్య గౌడ్, కొట్టె అశోక్, ముద్దం తిరుపతిగౌడ్, తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, గుర్రం రమేష్‌గౌడ్, కడారి శంకర్, నెరుమట్ల మల్లేశం, చుప్ప శ్రీనివాస్, తోడేటి డేవిడ్, పత్తిపాక నరేశ్, గడమల్ల గంగారాం పాల్గొన్నారు.

'బేతాళుడు' లఘు చిత్రం చిత్రీకరణ ప్రారంభం

కరీంనగర్ కల్చరల్ జూలై (ఆంధ్రజ్యోతి) 25: శ్రీవివన్ క్రియేషన్స్ బ్యానర్‌పై జర్నలిస్టు అయిలు రమేశ్ దర్శకత్వంలో ఆశిర్ చెల్క నిర్మిస్తున్న 'బేతాళుడు' లఘు చిత్ర షూటింగ్ శుక్రవారం నగునూరు, కరీంనగర్‌లో ప్రారంభమైంది. చిత్రంలో డాక్టర్ శివరాం, వేముల అశోక్, కిషోర్ దూలూరు, కీర్తి, నిఖిల్ చిట్ల, మనీషా, కనపర్తి శ్రీనివాస్, రాణి, మర్రి రాజు, వివన్, అంజలి, శర్వాణి నటిస్తుండగా మేకప్‌మన్‌గా శ్రీరామోజు అశోక్‌చారి, కాస్ట్యూమ్స్ రాణి, ధర్మరాజు, ప్రొడక్షన్ సహకారం భాస్కర్, అజయ్, రచనా సహకారం శివ తారక్, ఎడిటింగ్ ఆకెన భాస్కర్, కెమెరా ఆశిర్, కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం అయిలు రమేశ్ వ్యవహరిస్తున్నారు.